'కంటి వెలుగు'పై అలసత్వం వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని, ఎవరూ అలసత్వం చేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. శనివారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కంటి వెలుగుపై ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డాక్టర్ త్రినాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన భూముల జోలికొస్తే ఊరుకోం

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు

- భూముల స్వాహాకు దొంగ పత్రాలు సృష్టి
- మంత్రి సీదిరి అప్పలరాజు సొంతం చేసుకోవాలని అనుకుంటున్నారు
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు
- మందసలో వీరగునమ్మ వర్ధంతి సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మందస ప్రాంతంలోని గిరిజన భూములకు దొంగ పత్రాలు సృష్టించి స్వాహా చేయాలని చూస్తే ఊరుకోబోమని మాజీ ఎంపీ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు అన్నారు. వీరగున్నమ్మ 83వ వర్ధంతి సందర్భంగా మందస బస్టాండ్ కూడలిలో శనివారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజనులు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూములను మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన సొంతం చేసుకోవాలని చూస్తున్నారని ఆయన చెప్పారు. మందసలోని కొన్ని గ్రామాల్లో రైతులకు చెప్పకుండా, భూములకు పరిహారం ఇవ్వకుండా అడ్డగోలుగా గ్యాస్ పైపులైన్లు వేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో జనం మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాలుగేళ్ల కిందట ప్రారంభించిన రీసెర్చ్ సెంటర్ ఇప్పటికీ పూర్తి కాలేదని విమర్శించారు. తిత్లీ తుపానుతో నష్టపోయిన రైతాంగానికి రెండు రెట్ల పరిహారం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని ఆయన అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ 2008లో ప్రారంభమైనా పాలకులు ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారని చెప్పారు. మందస ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లోకి ఒడిశా అధికారులు దౌర్జన్యంగా ప్రవేశిస్తున్నా ఆ ప్రభుత్వంతో ఉన్న సరిహద్దు వివాదాలను పరిష్కరించడంలోనూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. వంశధార నిర్వాసితులను టిడిపి ప్రభుత్వం నిండా ముంచేస్తే.., తాము అధికారంలోకి వస్తే 2013 భూసేకరణ చట్టం అమలు చేస్తామన్న జగన్మోహన్‌రెడ్డి అరకొర పరిహారం చెల్లించి, చేతులు దులుపుకున్నారని ఆయన విమర్శించారు.

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ మందస జమిందార్లు అనేక రకాల పన్నులు వేస్తూ చెల్లించని వారిని నిర్బంధానికి గురిచేశారని చెప్పారు. అడవిలో కట్టెలు తీసుకువస్తున్న వారిని పోలీసులు అడ్డగించడంతో వారి తూటాలకు ఎదురొడ్డి వీరగున్నమ్మ నిలిచారని చెప్పారు. మందస జమిందార్లకు వ్యతిరేకంగా వీరగున్నమ్మ సాగించిన పోరాటాల ఫలితంగానే జమిందారీ వ్యవస్థ రద్దు, రైతులకు కొన్ని రకాల హక్కులు వచ్చాయని చెప్పారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారుల

ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ర్యాలీ చేస్తున్న ప్రజలు

రూపంలో ప్రస్తుతం నయా జమిందారీ వ్యవస్థ నడుస్తోందని, దానిపై కలిసికట్టుగా అంతా పోరాడాలని ఆయన అన్నారు

సిఐటియు నాయకులు డి.గోవిందరావు మాట్లాడుతూ వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా సాగునీటి రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జీడి రైతులకు 80కేజీల జీడి బస్తాకు రూ.16వేలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల భూములను ఆక్రమించుకుంటున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంపదను పాలకులు పెటుబడిదారులకు కట్టబెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారుల కోసమే పని చేస్తున్నాయన్నారు. రైతులు, కార్మికులు, గిరిజనుల హక్కులు, భావితరాల కోసం అందరూ కలిసి పని చేయాలని కోరారు.

భారీ ర్యాలీ

వర్ధంతి సందర్భంగా వీరగున్నపురం కూడలి నుంచి మందస బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. డప్పులు వాయిస్తూ కళాకారులు ర్యాలీగా ముందు నడిచారు. అంతకుముందు వీరగున్నమ్మపురం కూడలి వద్ద ఉన్న అమరవీరుల స్తూపానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధుతో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభా వేదికపై పలువురు ప్రజా కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు రాసిన 'వీరగున్నమ్మ కళింగ సివంగి' పుస్తకాన్ని ఆవిష్కరించారు

కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, సవర ధర్మారావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సవర ధర్మారావు, నాయకులు ఎన్.గణపతి, ఆర్.దిలీప్‌కుమార్, కె.కేశవరావు, రట్టి కృష్ణ, పి.సరస్వతి, జి.బాలమ్మ, వర్తక సంఘం ప్రతినిధి వడ్డి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ముఖ్య కూడళ్లలో నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో నమోదైన నేరాలపై నేర సమీక్ష నిర్వహించారు. స్పందన పిటిషన్లు, సిసి కెమెరాల ఏర్పాటు, తీవ్రమైన (గ్రేవ్ కేసులు) నేరాలు, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసులు, ఎస్‌సి, ఎస్‌టి కేసులు, పోక్స్ కేసులపై సమీక్షించారు. ముఖ్యమైన కేసులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పలు ముఖ్యమైన అంశాలపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ముఖ్య కూడళ్లలో, బంగారం దుకాణాలు, వ్యాపార సంస్థలు, అపార్ట్మెంట్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొన్ని తరహా నేరాలు ఛేదించడంలో సిసి ఫుటేజీ కీలకం అని తెలిపారు. మహిళా పోలీసులతో క్షేత్రస్థాయిలో మహిళలకు ఎం ఆధార్ యాప్‌లో బయోమెట్రిక్ లోక్‌పై, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి స్థాయిలో చేయాలని, నిందితులను అరెస్ట్ చేసి కేసు ప్రాపర్టీ రికవరీ చేయాలని అన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ కేసుల్లో ప్రాపర్టీ సీజింగ్, కేసు దర్యాప్తు, నిందితుల అరెస్టులో జాగ్రత్తలను పాటిస్తూ నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు చేయాలని సూచించారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి సారించి, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసి, నిశితమైన సాక్ష్యాధారాలు సేకరించి, కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. మహిళలపై జరిగిన నేరాల్లో ఫిర్యాదు అందితే సకాలంలో స్పందించి నేర స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించి, సరైన సాక్ష్యాలు, ఆధారాలు సేకరించి 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి, అన్ని పత్రాలను కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. సాంకేతికతతో త్వరితగతిన సైబర్ కేసులను దర్యాప్తును చేయాలన్నారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని ఎస్‌పి సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఐదుగురు పోలీసు సిబ్బంది, మహిళ పోలీసుతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్ష కేంద్రాల వద్ద ఇతరులు ఎవరూ గుంపుగా తిరగకుండా చూడాలని, జెరాక్స్ షాపులను మూసివేయించాలని అన్నారు.

సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు మహేంద్ర, సిహెచ్ ప్రసాదరావు, ఎన్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు, ఎం.శివారామరెడ్డి, కె.బాలరాజు, డి.ప్రసాద్‌రావు, ఎఒ ఎం.శివరామరాజు, సిఐలు, వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆ సంస్థ ఛైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎపి టిడ్కో హౌసింగ్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పాత్రునివలస వద్ద నిర్మిస్తున్న 1280 టిడ్కో ఇళ్లకు సంబంధించి పనుల పురోగతిని ఆయన ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే రాష్టంలో మూడు నెలల్లో విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. జిల్లాలో కూడా త్వరితగతిన పూర్తిచేసి అన్ని మౌలిక సదుపాయాలతో ఈ నెల 30వ తేదీకి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. తొలుత మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కమిషనరు చల్లా ఓబులేసు, మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, టిడ్కో ఎస్‌ఇ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్

'ఆఫ్‌షోర్' పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తాం

రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

ఆఫ్‌షోర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, దీన్ని పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం వెలుగు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళా సంఘాలకు ఆయన పంపిణీ చేశారు. ముందుగా జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళా సంఘాలతో పాటు అప్పలరాజు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆఫ్‌షోర్‌కు కీర్తిశేషులు హనుమంతు అప్పయ్యదొర నామకరణం చేస్తామని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలు అప్పట్లో ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం అప్పులపాలవుతుందని దుష్ప్రచారం చేస్తూ తాను అధికారంలోకి వస్తే జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలని కొనసాగిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బాబు అధికారంలోకి వస్తే ఈ పథకాలను నిలిపివేస్తాడని అన్నారు. ముఖ్యమంత్రి సీటు కోసమే అబద్ధాలు ఆడుతున్నాడని, ఈ విషయం మహిళలందరూ గుర్తించుకోవాలన్నారు.

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

మంత్రి వర్యా.. తాగునీరు ఇప్పించండి

మంత్రి సీదిరి అప్పలరాజుకు తాగునీరు సరఫరా చేయాలని గంగువాడ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు కోరారు. గ్రామ అంతటికి ఒకే బావి ఉండడంతో తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మహిళలు మంత్రి దష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందిస్తూ గ్రామానికి మంచినీటి ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణను ఆదేశించారు. గ్రామాన్ని సందర్శించి తాగునీరు అందేలా చర్యలు చేపడతారని మహిళకు హామీ ఇచ్చారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి అప్పలరాజు

కార్యక్రమంలో ఉంగ ప్రవీణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, కన్వీనర్ దువ్వాడ రవికుమార్, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, హనుమంతు వెంకటరావు, వ్యవసాయ శాఖ మండల కన్వీనర్ గొర్రెల వేణు, జెడ్‌పిటిసి రచ్చ రత్నాలు, తలగాన శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

హస్తం మళ్లీ పిడికిలి బిగిస్తుందా?

దేశ రాజకీయాల్లో సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ రాజకీయ నిర్ణయాలతో తొలిసారి అధికారం కోల్పోయింది. ఆ తరువాత నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలుకు శ్రీకారం చుట్టడంతో అధికారం పొందడంలో ఎదురుదెబ్బలను, ఆటుపోట్లను ఎదుర్కొంది. పార్టీలో అధికారం కేంద్రీకృతం కావడంలోనూ, స్వపక్షంలోనే ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ గ్రూపుల గోల చేయడం నేటికీ చూస్తున్నాం. పాలనా వైఫల్యాలను చూశాం. ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడాన్ని చూశాం. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఆ పార్టీకి మైలేజ్ ఇచ్చిందని, వచ్చిందని పార్టీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఇలాంటి సమయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం కాంగ్రెస్‌కు మరింత జీవం పోసినట్లయింది. ప్రతిపక్షాలు ఏకతాటిపై బిజెపి నియంతృత్వ చర్యలను ఖండించాయి. రాష్ట్ర విభజన సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరితో వ్యవహరించి ముక్కలు చేసింది. వైసిపి ఆవిర్భావానికి అనువైన నిర్ణయాలు తీసుకోవడం, రాజకీయ వ్యూహంలో వైఫల్యాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సెల్ఫ్‌గోల్ చేసుకున్నట్లు అయ్యింది. నాటి రాజకీయ పరిణామాలు జిల్లాపైన తీవ్ర ప్రభావం చూపింది. కాంగ్రెస్ నుంచి వలసలు మొదలయ్యాయి. పార్టీని కాపాడుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అలక్ష్యం ప్రదర్శించింది. జిల్లాలో కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు ఇప్పటికీ ఉన్నారు. పార్టీని కూడగట్టి నడిపించేందుకు నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. పార్టీని జిల్లాలో పునర్నిర్మాణాన్ని చేపట్టడంతో డిసిసికి సరైన మార్గదర్శకాలు పిసిసి నుంచి రావడం లేదని, పార్టీని నమ్ముకొని ఉన్న వారు భావిస్తున్నట్లు తెలిసింది. పిసిసి అధ్యక్షులుగా శైలజానాథ్ ఉన్న సమయంలోనే డిసిసి అధ్యక్షులను మార్చుతారన్న ప్రచారం ఉండేది. జిల్లాలో డిసిసి కార్యాలయానికి అద్దెలు వస్తున్నందున పిసిసికి నెలకు రూ.లక్ష చెల్లిస్తే మంచిదని శైలజానాథ్ ప్రత్యేకంగా డిసిసి అధ్యక్షులను కోరినట్లు తెలిసింది. అంతే జిల్లాలో పార్టీ నిలదొక్కుకునే పని చేయడం కంటే ధన సమీకరణే ప్రధానమన్న ధోరణిలో పిసిసి అధ్యక్షులు ఉండటం విశేషం. ఆ సమయంలో జిల్లాలో డిసిసి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కొందరు పావులు కదిపినట్లు తెలిసింది. ముఖ్యంగా ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెరపైకి వచ్చినట్లు సమాచారం. వారిద్దరూ సూపర్‌స్టార్, నట సామ్రాట్ నామకరణాలతో ఉన్నట్లు తెలిసింది. డిసిసి అధ్యక్షులుకు పైరవీలు చేస్తున్న క్రమంలోనే ఎన్నికల్లో టిక్కెట్లు కోసం ఇద్దరు, ముగ్గురి నుంచి లక్షల రూపాయలు వసూళ్ల చేసినట్లు ప్రచారం జరిగింది. టిక్కెట్ రాకున్నా నీ డబ్బుకు ఏం ప్రమాదం లేదని, రియల్ ఎస్టేట్‌లో పెడతానని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఈ వసూళ్ల శృతి మించడంతో డిసిసి కార్యాలయంలోనే దాడి చేయడంతో పాటు ఆయన వాహనాన్ని కూడా తీసుకుపోయిన ఘటన జరిగినట్లు తెలిసింది. ఇక్కడ ఓ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరేముంది కాంగ్రెస్‌కు అనుకున్న సమయంలోనే టిక్కెట్లు కోసం, పదవుల కోసం డబ్బులు ఖర్చుపెట్టి, పోటీ పడుతున్న పరిస్థితులను చూస్తున్నాం. ప్రజారాజ్యం పార్టీని చిరంజీవి కాంగ్రెస్‌లో విలీనం చేసిన తరువాత ఆ పార్టీ ద్వారా కాంగ్రెస్‌కు వచ్చిన వారు రాజకీయ అనుభవం ఉన్న వారు ఇప్పటికీ పార్టీలో ఉన్నారు. క్రియాశీలకంగా పని చేయడానికి సన్నద్ధంగా ఉన్నారని తెలిసింది. డిసిసిని పునర్నిర్మాణం చేయాల్సిన అవసరాన్ని ఆ పార్టీలో మిగిలి ఉన్న వారు చెప్తున్నారు. డిసిసి అధ్యక్షులుగా ఉన్న బొడ్డేపల్లి సత్యవతి వయోభారంతో పాటు, ఇతర కారణాల రీత్యా క్రియాశీలకంగా జిల్లాలో పని చేయలేకపోతున్నారన్న అభిప్రాయం పార్టీలో ఉంది. ఏవైనా కార్యక్రమాలు చేపట్టినా శ్రీకాకుళం నగరానికే పరిమితం అవుతోంది తప్ప, జిల్లాలో ఎక్కడా జరిగే పరిస్థితి కనిపించడం లేదు. అధ్యక్ష బాధ్యతలను చేపట్టేందుకు సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు ప్రజా సంబంధాలు విస్తృతంగా ఉన్న వారు, విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవారు, విద్యావంతులు కొందరు నాయకత్వ బాధ్యతలను చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారని తెలిసింది. అలాంటి వారిని గుర్తించి బాధ్యతలను అప్పగించేందుకు రాష్ట్ర నాయకత్వం సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. పార్టీలో ఇప్పుడు పని చేయాలంటే జిల్లాలో ఇప్పుడు ఎలాంటి పదవులు, హోదాలు లేని పరిస్థితి ఉంది. గిడుగు రుద్రరాజు పిసిసి బాధ్యతలు చేపట్టిన తరువాత యువజన, విద్యార్థి, మహిళా తదితర అనుబంధ సంఘాలన్నింటినీ జిల్లాలో రద్దు చేయడమైంది. కొత్తగా నియమిస్తామని ప్రకటించినా అమల్లోకి రాలేదు. పార్టీలో ఇప్పుడు డిసిసి అధ్యక్షులు కనిపిస్తున్నారు తప్ప కార్యవర్గం కూడా పనిచేసే పరిస్థితి లేదు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో పిసిసి కొత్త పద్ధతిని అమల్లోకి తెచ్చింది. ప్రతి నియోజకవర్గంలోనూ ముగ్గురు నుంచి ఐదుగురు వరకు సమన్వయ కమిటీలను నియమించింది. ఆ సభ్యుల్లో, పలు నియోజకవర్గాల్లో సమతుల్యత కొరవడింది. రాజకీయ అనుభవం ఉన్న వారు, లేని వారు సామర్థ్యంలో వ్యత్యాసాలు ఎక్కువగా, తక్కువగా ఉన్న వారు ప్రజా, సంబంధాల్లో తేడాలు ఎక్కువగా ఉండటం, తదితర కారణాలతో వారి మధ్య సమతుల్యత, సమన్వయం కనిపించడం లేదు. జిల్లాలో ఏ సమస్య వచ్చినా, ఏ ఘటన జరిగినా స్పందించడానికి జిల్లా అధ్యక్షులు తప్ప, మరెవరూ స్పందించడానికి సిద్ధమయ్యే పరిస్థితి లేదు. సమన్వయకర్తలు కూడా స్పందించాలంటే వారి నియోజకవర్గానికే పరిమితమై మాట్లాడాలి తప్ప, అంతకు మించి మాట్లాడేందుకు అవకాశం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే కనీసం మీడియాలో ప్రచారం చేయడానికి కూడా పార్టీ కట్టడి చేసినట్లయింది. జిల్లాలో సమన్వయకర్తలను నియమించడంలోనూ పిసిసి సఫలం కాలేదు. జిల్లాలో ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను నియమించడానికి ఎవరూ దొరకలేదన్న అభిప్రాయం ఉంది. అందుకే ఆ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేనట్లయింది. జిల్లాలోనూ హిందూత్వ ప్రమాదం పెరుగుతున్న సమయంలో లౌకికశక్తులు బలపడాల్సిన చారిత్రక కర్తవ్యం ప్రజల ముందుంది. నేను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పడానికి నేనేమి సావార్కర్‌ను కాదని రాహుల్ గాంధీ ప్రకటించడాన్ని కాంగ్రెస్ అభిమానులు, శ్రేణులు పరిగణనలోకి తీసుకోవాల్సిన కర్తవ్యం, జాతీయోద్యమ చరిత్రను తెలుసుకున్న వారు అర్థం చేసుకోవాల్సి ఉంది. రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండూ కేంద్రంలోని హిందూత్వ, మతోన్మాద శక్తులకు పార్లమెంట్‌లోనూ, బయట అండగా నిలుస్తున్న చరిత్రను చూస్తున్నాం. జిల్లాలో ఉద్యమ వారసత్వానికి పునరంకితం సమయం ముంచుకొచ్చింది. లౌకికశక్తులుగా ఉన్న జిల్లాలో బలపడితే ఆ కర్తవ్య సాధనకు మరింత బలం చేకూర్చినట్లవుతుంది. జిల్లాలో హస్తం శ్రేణులు పిడికిళ్లను మళ్లీ బిగిస్తాయా! లేదా అన్నది కాలమే చెప్పాలి. రాజకీయ పార్టీగా కర్తవ్య బాధ్యతలను స్వీకరించాలి. రాబోయే ఎన్నికల ముందే అలాంటి రూపం హస్తం మార్కు పార్టీ జిల్లాలో తీసుకుంటుందా! లేదా! అన్నది చూడాల్సి ఉంది. ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని తాము బలపడేందుకు అనువుగా వినియోగించుకుంటుందా! లేదా! అన్నది కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సామర్థ్యం బట్టి ఆధారపడి ఉంది.

-సత్తారు భాస్కరరావు

8న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. వెంకటరామన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. ఉదయం 10.30గంటలకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిపి, ఇతర పాలక మండలి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
I.A.No.1015/2019 in A.S.No: /2019

Between:
Bejjipuram Lavanyavathi and others
--Petitioners/Appellants
And:
Thripurana Venkata RanganadharaRao and others -- Respondents / Respondents

To, R-1Thripurana Venkata Ranganadhara Rao, S/o Venkata Jagann adha Rao, Hindu, aged about 53 years, R/at Plot No.MIG-19, Housing Board Colony, Srikakulam Town and District.

R-2:Thripurana Venkata Jagannadha Rao, S/o late Ranganadhara Rao, Hindu, aged about 76 years, Rest do...

Take notice that the above Petition is posted for your notice and that you are hereby appear to before the Honourable court of the Principal District Judge, Srikakulam on **10.04.2023 at 10-30 A.M** personally or through Advocate. If you fail to appear the matter will be decide exparte in the honourable court.

VANA KRISHNA CHAND,
VULLAKULA KRISHNA RAO,
Advocates, for the Petitioners Appellants

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA.
O.S. 138/2021

Between:
Bora Dharmarao ...Plaintiff.
And:
Baratam Ramesh ...Defendant.

To.
Baratam Ramesh, S/o Suryanarayana, Bochavari Street, Gudem Village, Srikakulam Mandalam and District.

NOTICE

Please take notice that the above suit filed by the plaintiff against you for specific performance of agreement of sale, which stands posted to **04-04-2023** for your appearance and notice to you. So you pleased attend on the said date at about **10-30 A.M.** before the above court by personally or through your agent, otherwise the matter will be decided in your absence.

CHIGURUPALLI RAMA MOHAN,
Advocate,
Dhavala Colony,
Srikakulam
Cell: 9440116221

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక పోరాట ర్యాలీని విజయవంతం చేయాలని, కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో ఢిల్లీని విజయవంం చేయాలని పిలుపునిస్తూ... ఎచ్చెర్ల నుంచి చిలకపాలెం వరకు సిఐటియు ఆధ్వర్యాన శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రఓ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. బిజెపి పాలనలో దేశం అన్ని రంగాల్లో అధోగతి పాలయ్యిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయని, బియ్యం, పాలు, నూనెలు, పప్పు దినుసులతో సహా అన్ని వస్తువుల పైనా జిఎస్‌టి పేరుతో భారం మోపారని అన్నారు. వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1150 దాటిందన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ రేట్లు ఇష్టారాజ్యంగా పెంచి లక్షల కోట్లు భారాలు ప్రజల నెత్తిన రుద్దారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసి, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్‌తో సహా అన్నింటినీ ప్రయివేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. అంబానీలు, అదానీలకు పోర్టులు, విమానాశ్రయాలు, టెలికం, విద్యుత్ ఇలా ఒక్కొక్కటి ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్నారు. కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు-22 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల సబ్సిడీని పెంచాలన్నారు. 200 రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్. కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఎచ్చెర్ల మండల కన్వీనర్ దుర్గాప్రసాద్, నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.అశోక్, వైగోపాలుడు, నాగార్జున అగ్రికెమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వరదరాజులు, ఎం.రమణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి పిలుపునిచ్చారు. నగరంలోని డైమండ్ పార్కు వద్ద భవన నిర్మాణ కార్మికులతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి అనుపోజు కామేశ్వరరావు, యు.శంకరరావు, సిహెచ్.రమణ, తేజ పాల్గొన్నారు.

రణస్థలం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చలో ఢిల్లీ విజయవంతంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కె.సూరయ్య ఆధ్వర్యాన ప్రజా సంఘాల నాయకులు ప్రదర్శన చేపట్టారు. శనివారం సాయంత్రం డైమండ్ పార్కు నుంచి 7 రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కో-కన్వీనర్ ఎం.ఆదినారాయణమూర్తి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కె.కళ్యాణి, ఎన్.బలరాం, ఎస్.గణేష్, బి.ఆదిలక్ష్మి, ప్రమీలాదేవి, ఎస్.గోవర్ధనరావు, పద్మ, అప్పలరాజు, చిన్నారావు పాల్గొన్నారు.

రణస్థలం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చేపడుతున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ పిలుపునిచ్చారు. రణస్థలంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.మహాలక్ష్మి, సిఐటియు నాయకులు గొర్లె కృష్ణ, డి.తవుడు, తవిటిరాజు, పి.త్రినాథరావు, మండల శ్రీను పాల్గొన్నారు.

బహుమతిని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్ఎఫ్ఐ అధ్యయనం - పోరాటం అనే నినాదంతో దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందని జిల్లా ఉపాధ్యక్షులు చందు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గత నెల 6న జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షలో విజేతలకు ఆయా పాఠశాలలకు వెళ్లి బహుమతులను శనివారం అందజేశారు. ఈ పరీక్షల్లో మొదటి బహుమతిని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి యశస్విని, ద్వితీయ బహుమతిని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ విద్యార్థి డి.వి.ఎం.సుధీర్, తృతీయ బహుమతిని సిద్ధార్థ స్కూల్ విద్యార్థి ప్రియదర్శిని దక్కించుకున్నారు. ఎస్ఎఫ్ఐ బృందం ఆయా పాఠశాలలను సందర్శించి ప్రధానోపాధ్యాయుల సమక్షంలో బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అలాగే విద్యార్థుల్లో సమాజంపై అవగాహన పెంచేవిధంగా స్టడీ సర్కిల్ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, వాసు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో పతకాల పంట

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రశాంత్‌ను అభినందిస్తున్న భాస్కరరావు

రాజస్తాన్‌లోని కోట విశ్వవిద్యాలయంలో గత నెల 28 నుంచి 31 వరకు నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుడు ఆకుల ప్రశాంత్ అద్భుతమైన ప్రదర్శన కనబరచి రజిత పతకాన్ని సాధించాడు. జాతీయస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో బాలికల విభాగంలో దువ్వ త్రివేణి, పెద్దిన యషిత, క్యాడెట్ బాలుర విభాగంలో ఆకుల ప్రశాంత్, తాన్ని ఢిల్లీశ్వరరావు, జి.హిమచందన్, గొర్లె రిత్విక్‌లు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వారిలో నగరంలోని హయతీనగర్, రెల్లివీధికి చెందిన ఆకుల ప్రశాంత్ సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రం తరపున జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి రజిత పతకాన్ని సాధించాడని త్రైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు తెలిపారు. రాష్ట్రానికి 8 పతకాలు రావడం ఇదే ప్రథమమన్నారు. ఒక స్వర్ణం, రెండు రజితాలు, 5 కాంస్య పతకాలను క్రీడాకారులు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను శిక్షకులు భాస్కరరావులను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి, డిఇఒ గార పగడాలమ్మ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పెంకి సుందరరావు, ఉషు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ అభినందించారు.

వైసిపికి ఓటమి భయం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

సరుబుజ్జిలి : వైసిపి పాలనతో రాష్ట్రానికి ఇదేమి కర్మ అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని చిన్న గితాపల్లి పంచాయతీ పరిధిలోని బుడ్డివలస, వీరభద్రపురం గ్రామాల్లో శనివారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాలన వల్ల రాష్ట్రం 20 ఏళ్లు అభివృద్ధిలో వెనక్కి వెళ్లిపోయిందన్నారు. విద్యుత్, ఆస్తి, ఆర్‌టిసి ఛార్జీలను పెంచి నిట్ట నిలువునా ప్రజల దగ్గర నుంచి సొమ్మును దోచుకుంటున్నారని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం, వెలమల రమేష్, మీసాల రామారావు, కూన సంజయ్, పల్లి సురేష్, కిల్లి సిద్ధార్థ, ఎండ రామారావు పాల్గొన్నారు.

వైసిపి ఓటమి భయం పట్టుకుంది

పొందూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఊహించని పరాజయం ఎదురవ్వడంతో వైసిపి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని రాపాక, ఇల్లయ్యగారిపేట, లోలుగు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుభూతిపరుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీలిచ్చి వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించిందన్నారు. ఈయన వెంట తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి లోలుగు వెంకట్, టిడిపి నాయకులు కామరాజు, సన్యాసిరావు, మనోహరరావు, ప్రకాశరావు ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. స్థానిక మున్సిపల్ వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో సచివాలయ గృహసారథులు, కన్వీనర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేశారని అన్నారు. సమావేశంలో ఎపి సీడ్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు భారతిదివ్య, స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు

మెట్‌కోర్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో రావివలస మెట్‌కోర్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ వద్ద కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. కార్మికులకు గత కొంతకాలంగా పనులు లేకుండా ఉండడంతో ఫ్యాక్టరీ సిబ్బందిని లోనికి వెళ్లకుండా యాజమాన్యం అడ్డుకుంది. లోనికి ప్రవేశం కల్పించి రెగ్యులర్ కార్మికులను హాజరయ్యేలా చూడాలని కార్మికులు డిమాండ్ చేశారు. దీంతో యాజమాన్యం పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు పరిశ్రమ వద్దకు వద్దకు చేరుకుని కార్మికులతో, యాజమాన్యంతో చర్చించారు. అనంతరం వారం రోజుల్లో యథావిధిగా పనులు నిర్వహిస్తామని యాజమాన్యం తెలపడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

'మాట్'లో మెరిసిన సంతోష్

ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూట్ టెస్టులో నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ బిబిఎ విద్యార్థి సంతోష్ అగర్వాల్ 94.16 శాతం మార్కులు సాధించాడు. బిజినెస్ స్కూల్స్‌తో పాటూ మేనేజ్‌మెంట్ సంస్థలు ఉమ్మడిగా నిర్వహించే మ్యాట్‌లో 705 స్కోర్ సాధించి ముందంజలో నిలిచారని ప్రిన్సిపల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన సంతోష్ అగర్వాల్‌కు మేనేజ్‌మెంట్ సంస్థలతో పాటు బిజినెస్ స్కూల్స్‌లో పిజి మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం చేసే అరుదైన అవకాశం లభిస్తుందన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిబిఎ కోర్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని అన్నారు. అనంతరం కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అత్యున్నత భవిష్యత్ అందిస్తున్నారని అన్నారు. సంతోష్ అగర్వాల్ మ్యాట్‌లో ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రెటరీ సుగుణరెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రభాకరరావు, దీపికా, శ్రావణీ అభినందించారు.

బోయ, బెంతులను ఎస్‌టిల్లో చేర్చవద్దు

టెక్కలి రూరల్ : బోయలను, బెంతులను ఎస్‌టి జాబితాలోకి చేర్చితే సహించేదిలేదని గిరిజన సంఘం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి బందపల్లి రవి హెచ్చరించారు. టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ జక్కరపేటలో శనివారం గిరిజన సంఘం సమావేశం నిర్వహించి అనంతరం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన హక్కులను కాలరాస్తూ పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన సంస్కృతి, జీవన విధానాన్ని ప్రక్కన పెట్టి ఓట్ల కోసం ఇతర తరగతులను ఎస్‌టి జాబితాలోకి చేరుస్తామని ఇటీవల అసెంబ్లీలో తీర్మానడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని గిరిజనులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొంతు అప్పారావు, ధర్మారావు, హరేష్, రమేష్, ప్రసాద్, నరసమ్మ, లచ్చుమయ్య పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

'మడ్డువలస' కాలువ పరిశీలన

పరిశీలిస్తున్న డిఇ రమణ

ప్రజాశక్తి- లావేరు

ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే మడ్డువలస ఫేజ్-2 కాలువ పనులను చేపడతామని మడ్డువలస డిఇ జి.వి.రమణ అన్నారు. మండలంలోని పైడాయివలస, గుర్రాలపాలెం గ్రామాల్లోని మడ్డువలస కాలువ పనులను పరిశీలించారు. ఇటీవల టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడులు రైతులతో కలిసి శ్రీకాకుళంలోని స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు చేపట్టడానికి రూ.35 లక్షలు ఖర్చు అవుతాయని ప్రతిపాదన పంపించామని అన్నారు. ఉపాధి కూలీలతో పనులు చేపట్టేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. గుర్రాలపాలెం వద్ద ఉన్న కాలువ వల్ల తాము ఇబ్బందులు పడుతున్నమని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, ఎఇలు కోటేశ్వరరావు. బి.వి.శ్రీనివాసరావు, యినపకుర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'పది' కీలకం

ఇచ్ఛాపురం : విద్యార్థులకు పదో తరగతి కీలకమని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో శనివారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల నుంచి నిర్వహించనున్న పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లితండ్రులకు, విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ చాట్ల సుజాతరెడ్డి, కో-ఆర్డినేటర్ నీలిమ, అధ్యాపకులు నవీన్, సంతోష్ని, భవాని, జ్యోతి, జగదీష్, రమేష్, సందీప్, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న తులసీదాస్‌రెడ్డి

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

'పది'లో మెరుగైన ఫలితాలకు ఉపాధ్యాయుల కార్యాచరణ

ప్రజాశక్తి- పొందూరు

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. పాఠశాలల్లోని విద్యార్థులను గ్రూపులుగా విభజించి తక్కువ మార్కులు వస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచారు. పరీక్షల సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై కూడా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఫలితాల సాధనకు చేపట్టిన కార్యాచరణపై 'ప్రజాశక్తి' కథనం.

ఈ ఏడాది మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలో వంద శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ప్రణాళికలను రూపొందించారు. మండలంలోని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కింతలి, తాడివలస, లోలుగు, పిల్లలవలస, తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఎపి మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు.

ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వాహణ

మండలంలోని పొందూరు-ఎ, బి కేంద్రాలు, ఎపి మోడల్ స్కూల్, కింతలి, తాడివలస పాఠశాల కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ ఐదు కేంద్రాల్లో మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలతో పాటు మానసవేణి హైస్కూల్, సంతకవిటి మండలంలోని సంతవురిటి, శ్రీరామ ప్రయివేటు పాఠశాలలకు చెందిన 899 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో పొందూరు-ఎ కేంద్రంలో 220 మంది, పొందూరు-బి కేంద్రంలో 220 మంది, ఎపి మోడల్ స్కూల్‌లో 220 మంది, తాడివలసలో 59 మంది, కింతలిలో 180 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు.

ఎ,బి,సి గ్రేడులుగా విభజించాం

పదో తరగతిలో శత శాతం ఫలితాల సాధనకు మొత్తం 43 మంది విద్యార్థినులను గ్రేడులుగా విభజించి తర్ఫీదును ఇచ్చాం. ఎ,బి గ్రేడ్‌ల్లోని విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించేలా తర్ఫీదు ఇవ్వడంతో పాటు సి- గ్రేడులోని వారు అన్ని సబ్జెక్టులు పాసయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాం. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాం.

- రేజేటి సౌమ్య, ప్రిన్సిపాల్, కెజిబివి

ప్రత్యేక తరగతులు నిర్వహించాం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాం. రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేశాం. ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి వారు ఇంటి వద్ద అనుసరించాల్సిన నియమాలను తెలియజేశాం. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాం.

- పి.వి.రామరాజు, ఎంఇఒ, పొందూరు

కెజిబివిలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు (ఫైల్)

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతను సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహించడంతో పాటు, రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను నిర్వహించడం, సందేహాలను నివృత్తి చేయడం, పరీక్షలను నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి మానసిక స్థైర్యాన్ని నింపేలా సూచనలు చేశారు. అలాగే నిపుణులు తయారు చేసిన మాదిరి ప్రశ్నపత్రాలతో సాధన చేయించారు. విద్యార్థులు ఇంటివద్ద చదువుతున్నదీ లేనిదీ తెలుసుకునేలా ఇంటింటా పర్యవేక్షించారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యార్థులపై వారు తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నాటుసారాను నియంత్రించాలి

కవిటి: మండలంలో నాటుసారా ఏరులై పారుతోందని, దీన్ని తాగి అనేక మంది కూలీలు, పేదలు అనారోగ్యానికి గురవుతున్నారని ఇచ్ఛాపురం జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే పోలీసులు దీనిపై దృష్టి సారించి నాటుసారా నియంత్రించాలని కోరారు.కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న నాయకులు

పలువురి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు దువ్వాడ శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, శివాజీ బార్య గౌతు విజయలక్ష్మి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి (బాబ్జి) శనివారం మృతుడు కుటుంబ సభ్యులు నాగావళి, కృష్ణమూర్తినాయుడులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వీరితో పాటు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, సురాడ మోహనరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, బిర్లే రాజు, చక్రధర్, మెట్ట రమణ, గరుగు సింహాచలం, యాదగిరి, జోగ మల్లి, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులకు చర్యలు

డిఎంహెచ్ఒ మీనాక్షి

శ్రీకాకుళం అర్బన్:జిల్లాలో ప్రసూతి సమయంలో మాతా శిశుమరణాలకు తావు లేకుండా తప్పని సరిగా ఆస్పత్రిలోనే కాన్పు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో మాతృ, శిశు మరణాలపైన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గర్భవతులకు ప్రభుతాస్పత్రులపై నమ్మకం కలిగించాలన్నారు. గర్భవతులను వైద్యాధికారి పిహెచ్‌సి పరిధిలో నెలలో రెండుసార్లు తనిఖీలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్లు నెలలో నాలుగు సార్లు గర్భిణులతో మాట్లాడి పేర్లు నమోదు చేయాలన్నారు. ఐడి నంబరు పొంది తరువాత ఐరన్ పోలిక్ టాబ్లెట్స్, టిటి ఇంజెక్షన్స్ ఇవ్వాలన్నారు. ప్రసవానికి ముందు హైరిస్క్ గర్భవతులను గుర్తించి కనీసం నెలకు రెండు తనిఖీలు చేయించుకునేలా చూడాలన్నారు. గైనకాలజిస్టు డాక్టర్ కె.పద్మావతి, డాక్టర్ ఎస్.ఉమాసౌజన్య, డాక్టర్ విద్యుల్లతా, డిసిహెచ్ఎస్ డాక్టర్ భాస్కరరావు, ఐసిడిఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, డిఐఒ, ఆర్.వి.ఎస్.కుమార్, డాక్టర్ లక్ష్మీతులసీ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి బొడ్డేపల్లిపేట ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మున్సిపాలిటీ పరిధిలోని పాతిన వారివీధి, కొత్తకోట వారివీధి సగభాగం, మోణింగివారి వీధి, డాబాల వారి వీధి, పాల పోలమ్మ ఆలయం, కామేశ్వరి కళ్యాణ మండపం, పోలీస్‌స్టేషన్, కోర్టు, కాలేజీ రోడ్డు, రూరల్ పరిధిలో పెద్దజొన్నవలస, చిన్నజొన్నవలస, మునగవలస, అక్కులపేట, సైలాడ, పొన్నాంపేట, జి.కె.వలస, రామచంద్రపురం, రాధాకృష్ణాపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పేదలందరికీ ఇళ్లు

నరసన్నపేట : పేదలందరికీ ఇళ్లు కల్పించి వారి సొంతింటి కలను నెరవేర్చడమే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కోమర్తిలో ఇళ్లు 13 మంది ఇళ్లు లేని వారి కోసం కేటాయించిన వైఎస్ఆర్, జగనన్న ఇళ్ల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పల్లిపేట కూడలి వద్ద ఉన్న ఆర్అండ్‌బి బంగ్లాకు రూ.20 లక్షలతో నిర్మించిన కాంపౌండ్ వాల్, ప్రధాన గేటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ హయాంలో దీనిని నిర్మాణానికి రూ.1.85 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. అలాగే ఉర్లాంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్నీ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపిపి ఆరంగి మురళీధర్, చింతు రామారావు, సర్పంచ్ బూరెళ్ల శంకర్, ఆర్అండ్‌బి డిఇ తిరుపతిరావు, జెఇ రాజశేఖర్, పోతయ్యవలస సర్పంచ్ కనపల శేఖరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పొట్నూరు సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంఇఒ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

కొత్తూరు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కె.విజయకుమార్ కోరారు. ఈ మేరకు ఎంఇఒ బి.శ్రీధర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఆర్ అప్‌డేషన్ చేయాలని, ఇఎల్ఎస్ బిల్లు చెల్లించాలని, సింగిల్ ఉపాధ్యాయులకు సెలువు మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని విన్నవించారు. దీనిపై ఎంఇఒ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బోద శ్రీను, కొండలరావు, ఎం.సంగమేష్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, భుజంగరావు, తారక్, పురుషోత్తం, రమణ పాల్గొన్నారు.

సత్యకుమార్‌పై దాడి సరికాదు

రణస్థలం రూరల్: బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ వాహనంపై తుళ్లూరు మండల వైసిపి నాయకులు రాళ్లతో దాడి చేయడం సరికాదని ఎచ్చెర్ల నియోజకవర్గ కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. రాజధాని అమరావతి రైతుల ఉద్యమమానికి మద్దతు తెలిపిన సత్యకుమార్‌పై వైసిపి నాయకులు చేపట్టిన దుశ్చర్యలకు నిరసిస్తూ నవభారత్ కూడలి జాతీయ రహదారిపై శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోషులపై కఠిన చర్యలు తీసు కోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవి, బంటుపల్లి ఎంపిటిసి టొంపల సంజీవరావు, తమ్మినేని గోవిందరావు, జి.త్రినాథరావు, గురాల రఘునాథ్, లక్ష్మణ్, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బిజెపి నాయకులు

యువ క్లబ్‌లో చేరిన విద్యార్థులు

'గురజాడ'లో యువ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రదేశాన్ని పర్యాటకులను తీసుకొచ్చేందుకు యువత భాగస్వాములు కావాలని జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలో ఉన్న గురజాడ కళాశాలలో యువ పర్యాటక క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యం, పరిశుభ్రత, ఇతర కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యాలయ డైరెక్టర్ జి.సంయుక్త ముట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ పర్యటిక ప్రదేశాలను పర్యటించి వీడియోగ్రాఫీ చేసి, ఫొటోలు జతచేసి వాటి చరిత్రను తెలుసుకోవాలన్నారు. అనంతరం ఒక ప్రాజెక్టు తయారు చేసి తీసుకుని రావాలని తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు మూర్తి మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా వారసత్వ సంపద తదితర విషయాలు తెలుసుకుని ఇతరులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.సంగమయ్య, టి.ఎస్.ఎన్.మూర్తి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా వివేకానంద

టెక్కలి : టెక్కలి జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా దివ్వల వివేకానంద ఎన్నికయ్యారు. 2023–24 సంవత్సరానికి గాను ఎన్నుకున్నారు. సమీప అభ్యర్థి బడే వెంకటరెడ్డిబాబుపై 19 ఓట్ల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో వివేకానంద ఆరోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు దుంపల భుజంగరావు, సహాయ కార్యదర్శిగా దాడి ధర్మారావు, కోశాధికారిగా రాజన్‌నాయుడు ఎన్నికైనారు. ఎన్నికల ఆధికారిగా పి.మధుబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు వైకుంఠరావు పాణిగ్రాహి, తిర్లంగి జానకిరామయ్య, బెండి గౌరీపతి, ఎజిపి గురువెల్లి కృష్ణారావు, దవళ రాజేశ్వరరావు, ఖజానా వెంకట రావు, పొట్నూరు ఆనందరావు, పేడాడ బాబూరావు, ఎ.వైకుంఠరావు, పి.సాయిరాజ్, ఎం.గోవింద్, బి.శ్రీనివాసరావులు అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న సిడిపిఒ బాలామణి

పౌష్టికాహారంతోనే పోషక విలువలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మనం తీసుకునే పౌష్టికాహారంలోనే పోషక విలువలు మెండుగా ఉంటాయని ఐసిడిఎస్ సిడిపిఒ కె.బాలామణి అన్నారు. దూసి సెక్టార్ పరిధిలోని సనపలవానిపేటలో పౌష్టికాహార పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత తలెత్తకుండా ఆకుకూరలు, బెల్లంతో కూడిన పదార్థాలు తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు సనపల రాజు, అంగన్వాడీ కార్యకర్తలు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, మొదలవలస లత పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది సత్యనారాయణ

ప్రథమ చికిత్సపై అవగాహన

నందిగాం : ప్రథమ చికిత్సపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ కె.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు ప్రమాదాలు సంభవిస్తే క్షతగాత్రుడి గుండెపై రుద్దాలని, నోట్లో నోరు పెట్టి ఆక్సిజన్ అందించాలని, గాయపడి రక్తం వస్తుంటే... తాడు కట్టి రక్తం బయటకు రాకుండా చేయాలని అవగాహన కల్పించారు. అనంతరం 20 మంది విద్యార్థులతో జూనియర్ రెడ్‌ఆకాస్ సొసైటీ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, సహాయకులు ఎస్.మహేష్, ఉపాధ్యాయులు బాలక రామారావు, ఇందిరాభాయ్, తులసీప్రసాద్, రంకిడి రామారావు, బెందాళం రత్నం, ఇందిరాభాయ్, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

భవన నిర్మాణానికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం భవన నిర్మాణ తాపీమేస్త్రీల సంఘం కొత్త భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమావేశాలు పెట్టుకునేందుకు భవనం లేకపోవడంతో ఆరు బయటకు నిర్వహిస్తున్నామని వివరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు జగన్నాథ్ బిసాయి, సెక్రటరీ టెంక ఈశ్వరరావు, మాజీ ప్రెసిడెంట్ పూర్ణచంద్ర పాడి, తట్ట భోగేశ్వరరావు, టిడిపి కౌన్సిల్ సభ్యులు ఆసి లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్, సంఘం సభ్యులు దుక్క రామారావు, జగన్నాథ బిసాయి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు అనుమానాస్పద లగేజీతో ఆటోలను ఎక్కినప్పుడు అప్రమత్తంగా ఉంటూ సమాచారం అందించాలని ఎస్ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ సూచించారు. ప్రేరణలో భాగంగా పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పాలపోలమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యాన ఆటోడ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే ఎస్ఇబి స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమణమూర్తి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సునీల్‌కుమార్

మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకే 'ఆసరా'

ప్రజాశక్తి- గార

మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమలు చేస్తోందని, ఇందుకోసం నాలుగు విడతల్లో బ్యాంకు రుణాల చెల్లించేందుకు సమ్మతించిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం అంబటివాని పేటలో ఆసరా లబ్ధిదారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీకూర్మం, కె.సైరిగాం, అంపోలు, గొంటి, రామచంద్రపురం, వాడాడ గ్రామాల్లోని ఆసరా లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ మహిళలకు మరింత ఆర్థిక చేయూత అవసరం అని భావించి, బకాయిలు ఉన్న డ్వాక్రా రుణాలను చెల్లిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ రాష్ట్ర మాజీ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం, ధర్మాన రామ్ మనోహర్ నాయుడు,

గార : మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, బొడ్డేపల్లి పద్మజ, ఎంపిపి గొండు రఘురాం, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

వజ్రపుకొత్తూరు : సిఎం జగన్ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని వజ్రపుకొత్తూరులో మూడో విడత ఆసరా లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించి సంఘ సభ్యులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతు వెంకటరావుదొర, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, జడ్ పిటిసి ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, ఎపిఎం కోడూరు జాంబవతి పాల్గొ॥

నరసన్నపేట : నరసన్నపేట మండలంలోని 34 పంచాయతీల పరిధిలో 47 గ్రామ సంఘాల మహిళా లబ్ధిదారులు రూ.11.41 కోట్లు ఆసరా అందిస్తున్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో

మెళియాపుట్టి : నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళి, జెడ్‌పిటిసి, ఉర్లాం సర్పంచ్ పోలాకి నరసింహమూర్తి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆసరా నమూనా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆర్.ఈశ్వరమ్మ, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రశేఖర్, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎపిఎం లలిత, పోలాకి జైమునిరావు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా తీర్మానం చేస్తే ఊరుకోం

నిలదీసిన టిడిపి సభ్యులు

పొందూరుఇష్టానుసారంగా తీర్మానం చేస్తూ... ఊరుకోమని మాజీ ఎంపిపి కూన ప్రమీల, టిడిపి ఎంపిటిసి ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తికాని మండల పరిషత్ నూతన భవనాన్ని పూర్తి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3 లక్షలు ఖర్చు చేసేందుకు తీర్మానం చేశారు. దీనిని కూన ప్రమీల, టిడిపి సభ్యులు వ్యతిరేకించారు. సమావేశంలో ఉన్న సభ్యుల్లో ఎక్కువ మంది సభ్యులు ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు మినిట్ బుక్‌లో రాయాలని పట్టుబట్టారు. సమావేశంలో పెట్టిన అజెండాపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామని అన్నారు. దీంతో సభ్యుల గందరగోళం మధ్య తీర్మానాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తూ ఎంపిపి వెళ్లిపోయారు. పూర్తిస్థాయిలో అధికారులు రాకుండా సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని, సమావేశానికి

ఎంపిపిని ప్రశ్నిస్తున్న టిడిపి సభ్యులు

ఎంపిడిఒ రాకపోతే సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఎవరు చెబుతారంటూ టిడిపి సభ్యులు పేర్కొన్నారు. మందుగా నిర్వహించిన సమావేశంలో పిల్లలవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులు కోసం ఉన్న తరగతి గదుల పైకప్పులను తొలగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ పోలినాయుడు ఎంఇఒ రామారాజు దృష్టికి తీసుకొచ్చారు. ఎంఇఒ స్పందిస్తూ... విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో జలజీవన్ మిషన్ పేరుతో పైపులు వేసేందుకు సిసి రోడ్లను తవ్వేశారని, ఇప్పుడు గుంతలు ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పొందూరు–4 ఎంపిటిసి బాడాన హారిక ప్రశ్నించారు. నెలరోజుల్లో గుంతలను పూడ్చివేస్తామని ఆర్‌డబ్ల్యూస్ జెఇ చైతన్య పేర్కొన్నారు. ఎస్.జి.ఎన్.పేటలో తాగునీటి బోర్ వేశారు కాని నీరు లేదని దల్లవలస ఎంపిటిసి కిల్లాన సూర్యారావు అన్నారు. మొదలవలసలో రెల్లిగెడ్డ ముంపు ప్రాంతంలో హెల్త్ క్లీనిక్ కడుతున్నారని, వర్షాకాలంలో ముంపుకు గురై వెళ్లలేని పరిస్థితి ఉందని ఎంపిటిసి సీతారామారావు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే రేషన్ సరుకుల్లో కందిపప్పు, పంచదార ఎందుకు ఇవ్వడం లేదని సభ్యులు మండిపడ్డారు. సమావేశంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైస్ ఎంపిపిలు వండాన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పరిపాలనా అధికారి వి.మురళీకృష్ణ, ఎఇ బాబ్జీ, విద్యుత్‌శాఖ ఎఇ దుర్గాప్రసాద్, సిడిపిఒ పాపినాయుడు, వెలుగు ఎపిఎం శ్యాలమరావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతుల్లో సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను వినియోగించుకుని అధునాతన పద్ధతుల్లో నూతన ఒరవడిని అందిపుచ్చుకొని పంటలను పండించాలని నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వరప్రసాదరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన వ్యవసాయ ప్రదర్శనపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణను అనుసరించి ఖర్చులను, సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. రైతులు సంఘటితంగా ఏర్పడి ముందుకొస్తే నాబార్డు ద్వారా సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. ప్రకృతి సేద్యంలో తయారు చేస్తున్న బెల్లాన్ని పరిశీలించి మంత్రముగ్ధులయ్యారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రేవతి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ప్రకృతి వ్యవసాయానికి చాలా రకాలుగా ప్రోత్సాహన్ని

మాట్లాడుతున్న ఎజిఎం వరప్రసాదరావు

అందిస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి సాగుపై ఎంతో శ్రద్ధతో క్షేత్రస్థాయిలో రైతులకు సేవలను అందిస్తున్నందుకు రేవతిని రైతుల సమక్షంలో సన్మానించారు. కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త సునీత, ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి సునీల్ కుమార్, బూర్జ మండలం పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సర్పంచ్ సోమరాజు తేజేశ్వరరావు, అభ్యుదయ రైతు ముద్దాడ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

కేన్సర్ బాధితునికి అండ

ప్రజాశక్తి- కవిటి

గొంతు కేన్సర్‌తో బాధపడుతున్న కవిటికి చెందిన మూలి శంకర్‌కు మాతృమూర్తి యువజన సంఘం అండగా నిలిచింది. కూలి పనిచేసుకుంటూ బతికే తాను మందులు కొనుక్కొనే పరిస్థితిలో కూడా లేనని, దాతలు అండగా నిలవాలని శంకర్ సామాజిక మాధ్యమాలు ద్వారా కోరాడు. దీనికి స్పందించిన మాతృమూర్తి సభ్యులు శనివారం ఇంటికి చేరుకుని శంకర్ కుటుంబాన్ని పరామర్శించారు. వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కుటుంబ సభ్యులు తెలపడంతో తక్షణ సాయంగా రూ.5 వేలు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న శంకర్ కుటుంబాన్ని దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగు, కార్యదర్శి సురేష్, సభ్యులు రామకృష్ణ, చలపతి, కేశవ, రమేశ్, సోమేష్, కూర్మారావు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలన

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని దేవాది వద్ద తాగునీటి కుళాయి మరమ్మతు పైపు పనులను మేజర్ పంచాయతీ సర్పంచ్ బి.శంకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాది వద్ద నరసన్నపేట పట్టణానికి వెళ్లే తాగునీటి కుళాయి పైపులైన్ ధ్వంసమైందన్నారు. దీంతో నీరు సరఫరా నిల్చిపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీంతో మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈయనతో పాటు వార్డు మెంబరు పొట్నూరు కృష్ణప్రసాద్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొట్నూరు. సాయిప్రసాద్, పట్ట ఠాగూర్ ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శంకర్

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పర్యావరణం మన ఉమ్మడి ఆస్తి అని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని సంఘ సంస్కర్త, రోటేరియన్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి అన్నారు. మండలంలోని చిట్టివలసలో జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా నైతిక విలువలు – పర్యావరణ కాలుష్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వనరులైన నీరు, విద్యుత్, ఇంధనం, భూములు, చెట్లను కాపాడుకోవాలన్నారు. తద్వారా కాలుష్యాన్ని నిర్మూలించవచ్చునని అన్నారు. ప్రతి వ్యకీ విజయవంతమైన, విలువైన వ్యక్తిగా మారడానికి ప్రయత్నించాలన్నారు. అనంతరం వాలంటీర్లతో కలిసి పర్యావరణాన్ని కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక అధికారి జలుమూరు రవిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత అధికారులకు రక్షణ కల్పించాలి

టెక్కలి : రాష్ట్రంలో దళిత అధికారులకు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అధికారులకు రక్షణ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం జగన్ సొంత జిల్లాలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆచ్చన్నను కిడ్నాప్ చేసి హత్యచేయడం, విశాఖపట్టణంలో డాక్టర్ సుధాకర్ హత్యలు ప్రభుత్వం పరోక్షంగా కారణమైందని అన్నారు. ఈ హత్య ఉదంతాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి జిల్లాల బిసి సంఘాలు, రాజకీయ పార్టీలతో విశాఖ నగరంలోని డాబా గారెండన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు భవన్‌లో ఈ నెల 3న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు టిడిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షులు కలగ జగదీష్ వెల్లడించారు. శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

వాహనాల తనిఖీ

బూర్జ : మండలంలో కురుంపేట కూడలి వద్ద ఎస్ఐ అశోక్‌బాబు శనివారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు హెల్మెట్ ధరించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. వాహన పత్రాలను తక్షణమే రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేడు 'సొండి'ల రాష్ట్ర సమావేశం

టెక్కలి : సొండిల సంఘం రాష్ట్ర సమావేశం ఆదివారం టెక్కలిలో నిర్వహించనున్నామని టెక్కలిశాఖ కార్యదర్శి గజవిల్లి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలోని సంఘం కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథచౌదరి పాల్గొంటారని తెలిపారు. సొండిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, తదితర డిమాండ్లపై సమీక్షిస్తామని అన్నారు. జిల్లాలోని సొండిలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బిజెపికి ఓటమి భయం మొదలైంది

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఓటమి భయం మొదలైందని కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి అమాంతంగా ఆదరణ పెరిగిందన్నారు. ఇది ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం కక్షపూరితమైన రాజకీయాలను చేస్తున్నారని విమర్శించారు. మోదీ, ఆదాని సంబంధాలపై ప్రశ్నిస్తున్నందుకే ఉద్దేశపూర్వకమైన కేసులు బనాయించారని అన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్స్ కె.లక్ష్మి, కె.జోగినాయుడు, వై.సూర్యనారాయణ, ఎం.గణేష్ పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వి.ఆర్.గూడెంలోని సర్వే నంబరు 137లోని కొండ గ్రావెల్ క్వారీలో అక్రమ తవ్వకాలపై శనివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి అక్రమ తవ్వకాలు చేపడుతుండగా... ప్రమాదవశత్తు విద్యార్థి మృతి చెందడంతో ఈ అక్రమ తవ్వకాలు వెలుగు చూడడంతో అధికారులు పరిశీలించారు. ఈ నంబరులో 475.95 ఎకరాలు కొండ ఉండగా, సంఘటన జరిగిన ప్రదేశంలో 1200 క్యూబిక్ మీటర్లు తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని మైనింగ్ అధికారులు పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడినది వి.ఆర్.గూడెంకు చెందిన ఎస్.మధుసూదనరావు గుర్తించామని తెలిపారు. ఇందులో మైనింగ్ డిడి ఫణిభూషణ్ రెడ్డి, ఎడి బాలాజీనాయక్, సర్వేయర్ గోవిందరావు, ఆర్ఐ రాధ, విఆర్ఓ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

రీ సర్వే వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఈదుపురం పంచాయతీలో చేపడుతున్న భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ సీతారామ్మూర్తి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో శనివారం సమీక్షించారు. అనంతరం అనంతరం ఈదుపురంలో చేపడుతున్న భూ రీ సర్వే పనులను స్వయంగా పరిశీలించారు. రైతులందరూ రీ సర్వేకు పూర్తిగా సహకారం అందించాలన్నారు. భూ సరిహద్దులు చూసుకోవాలన్నారు. రైతుల సందేహాల నివృత్తి చేస్తూ రీ సర్వే వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, శ్రావణకుమార్, మండల సర్వేయర్ తవిటినాయుడు, విఆర్‌ఒలు, మున్సిపల్ కమిషనర్ రమేష్, వెలుగు ఎపిఎం వరప్రసాదరావు, హౌసింగ్ ఎఇలు ప్రసాద్, దిలీప్‌లు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న నృత్య కళాకారులు

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి- పలాస

జగన్నాథ సంస్కృతిని విస్తరింపచేయాలని ఒడియా బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. కాశీబుగ్గ శ్రీ బృందావన చంద్ర ఆలయంలో శనివారం 87వ ఒడిశా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఒడియా బ్రాహ్మణుల సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరుగున పడిపోతున్న భాష, సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించేలా చూడాలన్నారు. పరిసర ప్రాంతాల ఒడియా సంఘం అభివృద్ధి సభ్యుడు సత్యనారాయణ పాడి, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర త్యాడి భవిష్యత్‌లో సంఘ అభివృద్ధికి, చేయబోయే ప్రణాళికలపై వివరించారు. అనంతరం పూరి పట్టణం నుంచి వచ్చిన ఒడిసి నృత్య కళాకారులు ప్రదర్శించిన ఒడిసి, సంబల్పూరి, జానపద నృత్యాలు ఆద్యంతము ఆకట్టుకుంది. కార్యక్రమంలో మందస పలాస, శ్రీకాకుళం, మందసలకు చెందిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంపిడిఒ ధనుంజయరావు

చెత్త సంపద కేంద్రం పరిశీలన

రణస్థలం: చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ధనుంజయరావు సూచించారు. జె.ఆర్.పురం సచివాలయ పరిధిలోని సంపద సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి సేంద్రీయ ఎరువులు తయారు చేసుకోవాలని సూచించారు. సేంద్రీయ ఎరువుల వినియోగం, విక్రయం ద్వారా లాభం పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రమణ, కార్యదర్శులు వరప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

పాతపట్నం : జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు ఉషారాణి కన్న ఊరు పోలాకి మండలం డోలకు వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ప్రగఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతోపాటు ఎల్ఎన్ పేట మాజీ మండల అధ్యక్షులు వెలమల గోవిందరావు, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబురావు, ధనుపురం మాజీ సర్పంచ్ మామిడి గంగాధర్, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఆరుబోలు దశరథ, అంపిలి పోలినాయుడు, బిల్లింగి భాస్కరరావు, కోడూరు రామారావు, వాలిపల్లి వెంకటరమణ, సాసుపల్లి దాలిరాజు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో 'ఉత్కళ దివస్'

ఇచ్ఛాపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాడి అధ్యక్షతన శనివారం ఘనంగా ఉత్కళ దివస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్రమ్మపుర్ బహుళ ప్రయోజనాల సమాజ మంగళ్ అధ్యక్షులు డాక్టర్ శంకర్ సన పాత్రో, కార్యదర్శి మహమ్మద్ అస్లామ్ పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ ఒకటిన నిర్వహించిన ఉత్కళ దివస్ గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశాంత్ జెన్న, రామకృష్ణ, రాజేంద్రకుమార్, త్రిపాఠి, మీరాబాయి పండా పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

అప్పలపేటలో అన్నదానం

బూర్జ : మండలంలోని అప్పలపేటలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురింపేట, బూర్జ, పి.ఎల్.దేవిపేట, మదనాపురం, జగన్నాథపురం, పెద్దపేట గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.